సాక్షి
అన్నమయ్య జిల్లా

ఆదివారం । 3 । సెప్టెంబర్ । 2023



భక్తులతో పులకించిన గండి

పవిత్ర పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయ స్వామి ఆలయం భక్తులతో పులకించిపోయింది. క్షేత్రంలో శ్రావణ మాసం మూడవ శనివారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. -8లో



బాధిత మహిళకు బాసటగా దిశ

ఆపదలో ఉన్న మహిళలు, అమ్మాయిలను కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన దిశ ఎస్‌ఓఎస్ యాప్ సత్ఫలితాలనిస్తోంది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.150	రూ.210
రెండోరకం	రూ.90	రూ.148

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 226 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

16న ఉర్దూ కవి సమ్మేళనం

మదనపల్లె సిటీ: తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూరులో ఈనెల 16న జాతీయ స్థాయి ఉర్దూ కవి సమ్మేళనం జరగనుంది. ఇందులో మదనపల్లెకు చెందిన కవులు ఖమర్‌అమీని, పఠాన్ మహమ్మద్‌ఖాన్‌లు పాల్గొనున్నారు. ఈ మేరకు తిరుపత్తూరులోని అంజుమనే మహొబ్బానే ఉర్దూ సంస్థ నుంచి ఆహ్వానం అందింది. ఖమర్‌అమినీ, మహమ్మద్‌ఖాన్ మాట్లాడుతూ మహాప్రవక్త హజ్రత్ మహమ్మద్ జన్మదినం సందర్భంగా నిర్వహించనున్న ఉర్దూ కవి సమ్మేళనంలో పాల్గొనడానికి ఆహ్వానం అందడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తమ కవిత్వంలో దైవభక్తి, దేశభక్తికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: కడప ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సీజీఏ(ఒకేషనల్) గ్రూపులో గెస్ట్ లెక్చరర్‌గా పనిచేయడానికి అర్హత కలిగిన (ఎంసీఏ/ఎంఎస్సీ కంప్యూటర్‌సైన్సు) ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/బీటెక్ సీఎస్‌సీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ సూర్యరావు తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 5వ తేదీ నేరుగా కళాశాల కార్యాలయంలో ఇవ్వాలని తెలిపారు. 6వ తేదీన ఇంటర్వ్యూ జరుగుతందని చెప్పారు.

పోస్టల్ అధికారిగా రాజేష్



కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కడప డివిజన్ పోస్టల్ సూపరింటెండ్‌గా జి.రాజేష్ నియమితులయ్యారు. ఈయన కర్నూలు పోస్టల్ రీజియన్ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తూ బదిలీపై ఇక్కడకి వచ్చారు. ఈయన త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

బ్ర.మఠంలో భారీ వర్షం

బ్రహ్మంగారిమఠం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠంలో శనివారం సాయంత్రం 4 గంటలనుంచి 5.30 వరుకు భారీ వర్షం కురిసింది.పదిరోజులుగా అధికంగా ఎండలు ఉడడంతో స్థానికులు, భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కసారిగా వర్షం రావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

5న జాబ్‌మేళా

బద్వేలు అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 5న రాచపూడినాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాలలో జాబ్‌మేళాను నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళరాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం జాబ్‌మేళాకు సంబంధించిన గోడపత్రాలను స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కియా మోటార్స్ ఇండియా, గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, సెంచూరీప్లై, ఏఐఎల్ డిక్సన్, ఫ్లిప్‌కార్ట్ వంటి 15 ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్న ఈ జాబ్‌మేళాలో పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, డిప్లొమా, ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు 90636 23706, 7013504977 నెంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, వార్డు ఇన్‌చార్జిలు పుత్తాశ్రీరాములు, చెన్నకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అంధ విద్యార్థి ప్రతిభ



విద్యార్థి తయారు చేసిన సోలార్ కూలర్

కడప ఎడ్యుకేషన్: కడప శంకరాపురంలోని ప్రభుత్వ అంధుల పాఠశాలకు చెందిన నందీశ్వరెడ్డి అనే అంధ విద్యార్థి వంద రూపాయల ఖర్చుతో సోలార్ ప్యానెల్ సహకారంతో కూలర్‌ను తయారు చేసి అందరిని అబ్బురపరిచాడు. సైన్స్ ఉపాధ్యాయుడు ఎబినైజర్ సహకారంతో మెడికల్‌షాప్ వారు ఉచితంగా ఇచ్చిన థర్మాకోల్ బాక్స్‌కు రంధ్రాలు వేసి చిన్నఫ్యాన్ అందులో అమర్చారు. తర్వాత మరికొన్ని చిన్న రంధ్రాలు చేసి అందులో పీవీసీ ముక్కలు ఉంచి వాటి చివర ఎల్ బెండులు అమర్చారు. సోలార్ ప్యానెల్ సహకారంతో ఫ్యాన్‌కు స్విచ్‌ను ఏర్పాటు చేశారు. థర్మాకోల్ బాక్స్‌లో ఐస్‌వాటర్ పోసి మూత మూసి స్విచ్ ఆన్ చేస్తే ఫ్యాన్ తిరిగి అందులో నుంచి చల్లటి గాలి వీస్తుంది. అంధ విద్యార్థి ప్రయోగం అందరిని అబ్బురపరిచింది.

స్మృత్యంజలి

- నాన్న వైఎస్సార్ ఘాట్ వద్ద సీఎం వైఎస్ జగన్ ఘన నివాళి
- మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నేతలతో మాటామంతీ

సాక్షి కడప : దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 14వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులతో ఇడుపులపాయలోని డాక్టర్ వైఎస్సార్ సమాధి వద్ద నివాళులర్పించారు. ఇడుపులపాయలోని డాక్టర్ వైఎస్సార్ సమాధి ఘాట్ వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రధానంగా రెవరెండ్ పాస్టర్లు ఆనంద్‌బాబు, నరేష్‌బాబు, మృత్యుంజయరావులు అక్కడనే ప్రార్థన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌తో తమకున్న అనుబంధాన్ని స్మరించుకున్నారు. ఎప్పటికీ మరిచిపోలేని మహానేతగా వైఎస్సార్ మిగిలిపోయారని... ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికూడా సంక్షేమ పథకాలను అన్ని వర్గాలకు అందిస్తూ పేద ప్రజల గుండెల్లో నిలిచిపోయారని పాస్టర్లు కొనియాడారు. ప్రార్థన కార్యక్రమం సందర్భంగా వైఎస్సార్ సతీమణి వైఎస్ విజయమ్మ సమాధి ఘాట్ వద్ద వైఎస్సార్‌ను తలుచుకుని కొద్దిసేపు భావోద్వేగానికి గురయ్యారు. ప్రార్థనల్లో డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా, జిల్లా ఇన్‌చార్జిమంత్రి ఆదిమూలపు సురేష్, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి, తుడా చైర్మన్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానమ్, ఎమ్మెల్యేలు రవీంద్రనాథ్‌రెడ్డి, రఘురామిరెడ్డి, మేడా మల్లికార్జునరెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, డాక్టర్ సుధ, టీజే సుధాకర్‌బాబు, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, కడప నగర మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీలు పి.రామసుబ్బారెడ్డి, డీసీ గోవిందరెడ్డి, రమేష్ యాదవ్, రామచంద్రారెడ్డి, ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు వైఎస్ కొండారెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ అభిషేక్‌రెడ్డి, యువ నాయకులు అర్జున్‌రెడ్డి, మైదుకూరు సమన్వయకర్త నాగిరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపేలరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పి.శివ ప్రసాద్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గిరిధర్ రెడ్డిలు పాల్గొన్నారు. ప్రార్థనలనంతరం వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఘాట్ వద్ద అందరూ రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు.



వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, చిత్రంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

ప్రజాప్రతినిధులు, ప్రజలతో కాసేపు

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇడుపులపాయలో వైఎస్సార్ ఘాట్ ప్రాంగణంతోపాటు హెలిప్యాడ్ వద్ద కొద్దిసేపు ప్రజలతో మమేకమయ్యారు. అలాగే సీఎం వైఎస్ జగన్, మంత్రులను, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పేరుపేరునా పలకరించారు. ప్రజలతో కాసేపు సమస్యలపై వినతులు స్వీకరించారు. ప్రార్థనలనంతరం నేరుగా వైఎస్సార్ గెస్టుహౌస్‌కు చేరుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కాసేపు గడిపారు. ముఖ్యమంత్రి వైఎస్సార్ గెస్టుహౌస్ వద్ద పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అలాగే బ్రహ్మకుమారీలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాఖీలు కట్టారు.

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో కడప ఎయిర్‌పోర్టుకు చేరుకోగానే ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, జిల్లా కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, ప్రొద్దుటూరు, చంద్రగిరి ఎమ్మెల్యేలు రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్, పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డిలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇడుపులపాయ హెలిప్యాడ్ వద్ద టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీలు రామచంద్రయ్య,రామసుబ్బారెడ్డి ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి వెంట ముఖ్య కార్యదర్శి ధనుంజయరెడ్డి, ఓఎస్‌డీ కృష్ణమోహన్‌రెడ్డి, వ్యక్తిగత కార్యదర్శి కె.నాగేశ్వరరెడ్డిలు ఉన్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆధ్వర్యంలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వరుణ నివాళి!

- సెప్టెంబర్ 2 వచ్చిందంటే వర్షం కురవాల్సిందే
- 2010 నుంచి క్రమం తప్పకుండా వస్తున్న ఆనవాయితీ
- ఇడుపులపాయలో కుండపోత వర్షం



సాక్షి ప్రతినిధి, కడప: వరుణదేవుడికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి అవినాభవ సంబంధం ఉందని మరోమారు రూఢీ అయింయింది. సెప్టెంబర్ 2వ తేదీ వచ్చిందంటే ఎక్కడ వర్షం లేకపోయినా ఇడుపులపాయలో వాన కురవడం అందుకు నిదర్శనం. గడిచిన 14 ఏళ్లుగా క్రమం తప్పకుండా ఈ ఆనవాయితీ వస్తోంది. నెల రోజులుగా వర్షం కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నా, వరుణుడు కరుణించలేదు. శనివారం సాయంత్రం నుంచి ఇడుపులపాయలో కారుమబ్బులు కమ్ముకున్నాయి. పొద్దు గూటికి చేరగానే వర్షం మొదలై కుండపోతగా మారింది. తొలుత ఇడుపులపాయలో ప్రారంభమైన వర్షం ఆ తర్వాత జిల్లా వ్యాప్తంగా విస్తృతమైంది.

- 2009 సెప్టెంబర్ 2న ముఖ్యమంత్రి హోదాలో హెలికాప్టర్‌లో ప్రయాణిస్తున్న డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పంచభూతాలల్లో కలిశారు. తర్వాత 2010సెప్టెంబర్ 2న ప్రథమ వర్ధంతికి రాష్ట్రవ్యాప్తంగా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చారు. ఎండవేడిమి ధాటికి తట్టులేని పరిస్థితులు ఉన్నట్టుండి మారిపోయి, మేఘావృతమై వర్షం కురిసిందని జిల్లా వాసులు అప్పటి పరిస్థితిని నెమరువేసుకుంటున్నారు. ఆనాటి నుంచి ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 2న బండపురుపు వర్షమైన ఇడుపులపాయలో కురిసి తీరాల్సిందే. ఆమేరకే 2023 సెప్టెంబర్ 2న కూడా వరుణుడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డికి నివాళులు అర్పించారని జిల్లాలో చర్చించుకోవడం విశేషం.

మహానేతా..మీ జ్ఞాపకాలు పదిలం



మదనపల్లె: తట్టివారిపల్లెలో వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే నవాజ్‌బాషా నివాళి



రాజంపేట రూరల్: రాజంపేట మండలం ఆకేపాడులో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి



రాయచోటి: రోగులకు పండ్లు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి తదితరులు



కడప: వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న నేతలు



వాల్మీకిపురం: టి.సాకిరేవుపల్లిలో..వైఎస్సార్ చిత్రపటం వద్ద ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి నివాళి

జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌కు ఘన నివాళి

రాయచోటి: ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేతా మీ జ్ఞాపకాలు వరువలేమంటూ వైఎస్ రాజశేఖర్ రెడ్డికి వాడవాడలా ఘన నివాళులు అర్పించారు. శనివారం అన్నమయ్య జిల్లా పరిధిలోని అన్ని నియోజకవర్గాలు, గ్రామ గ్రామాన పార్టీ నాయకులు, అభిమానులు, ప్రజలు వైఎస్సార్ చిత్రపటానికి, విగ్రహాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. రాయచోటిలో వైఎస్సార్ సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషాలు ప్రభుత్వ ఆసుపత్రిలో పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రైల్వేకోడూరు పట్టణంలోని టోల్గేట్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు నివాళులు అర్పించారు. రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి పాతబస్టాండ్ ఆవరణలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి స్థానిక ఎస్టేట్‌లో మహానేత చిత్రపటానికి నివాళులు అర్పించారు.అనంతరం అన్నదానం చేశారు. పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వాల్మీకిపురం మండలం సాకిరేవుపల్లిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పించారు. మదనపల్లి పట్టణ పరిధిలోని తట్టివారిపల్లిలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా, మున్సిపల్ చైర్మన్ వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మహానేత పాలనలో జిల్లాకు సమకూరిన ప్రాజెక్టులు, అభివృద్ధి వనరుల గురించి గుర్తు చేసుకున్నారు.



రాజంపేట రూరల్: పాతబస్టాండ్‌లో అల్పాహారం అందజేస్తున్న ఎమ్మెల్యే మేడా, అనీల్‌కుమార్‌రెడ్డి, పోలా నాయకులు

ఓటరు జాబితా పక్కాగా రూపొందించాలి

జిల్లా కలెక్టర్ గిరీష

కురబలకోట: ఓటరు జాబితా తప్పులు లేకుండా పక్కాగా రూపొందించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ పీఎస్ గిరీషా హెచ్చరించారు. శనివారం కురబలకోట మండలంలోని అంగళ్లు సచివాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బీఎల్ఓలు, వీఆర్వోలు రూపొందిస్తున్న ఓటరు జాబితా రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. సక్రమంగా లేని వాటిపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన అంగళ్లలో ఇళ్లకు వెళ్లి స్వయంగా ఓటర్లను కలసి విచారించారు. ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు, తొలగింపులు, చనిపోయిన వారివి తొలగింపు, డబుల్ ఓటర్లు, నూతన ఓటర్ల నమోదు పక్కాగా ఆపై పారదర్శకంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా మదనపల్లె-పీలేరు, ములకలచెరువు-మదనపల్లె ఫోర్‌వే పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలన్నారు.



అంగళ్లులో ఓటరు జాబితా ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా

గ్రామ కార్యదర్శులు ప్రజలతో మమేకం కావాలి

జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి

కురబలకోట: గ్రామ కార్యదర్శులు ప్రజలతో మమేకమై మెరుగైన సేవలు అందించడం ద్వారా ప్రభుత్వ లక్ష్య సాధనకు పాటుపడాలని అన్నమయ్య జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) ధనలక్ష్మి అన్నారు. అంగళ్లలో గ్రామ కార్యదర్శులకు అన్నమయ్య జిల్లా స్థాయిలో జరుగుతున్న ఐదోరోజు శిక్షణలో భాగంగా శనివారం లే అవుట్లు, భవన నిర్మాణ నియమ నిబంధనలు, స్వామిత్వ గురించి క్షేత్ర స్థాయిలో శిక్షణ ఇచ్చారు. లే అవుట్లకు అనుమతి ఇవ్వడం, స్వామిత్వ భూ సర్వే, గ్రామ పటాలు రూపొందించడం తదితర వాటిపై సమగ్ర అవగాహన కల్గి ఉండాలన్నారు. అనుమానాలు ఉంటే నిపుణుల నుండి నివృత్తి చేసుకోవాలన్నారు. భూముల రేట్లు అధికం అవుతున్నందున చిన్నపాటి తప్పులకు కూడా ఆస్కారం ఇవ్వరాదన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలపై సమర్థత, సామర్థ్యాలు పెంచుకోవాలన్నారు. మదనపల్లె డీఎల్‌పీఓ నాగరాజు మాట్లాడుతూ ఈనెల నాలుగు నుంచి తొమ్మిదో తేదీ వరకు రెండో బ్యాచ్‌కు శిక్షణ కార్యక్రమం ప్రారంభం అవుతుందని తెలిపారు. వారంతా సకాలంలో అంగళ్లుకు చేరుకోవాలన్నారు. గ్రామ పంచాయతీలలో ఆన్‌లైన్ విధానాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని టౌన్ ప్లానింగ్ అన్నమయ్య జిల్లా అధికారి సీటీ. కృష్ణాసింగ్ సూచించారు. ఏళ్లుగా వస్తున్న రికార్డుల విధానానికి స్వస్తి పలకాలన్నారు. ప్లాన్ అప్రూవల్ ప్రక్రియ ఆన్‌లైన్‌లో కొనసాగించాలన్నారు.



గ్రామ కార్యదర్శులకు అంగళ్లులో దిశానిర్దేశం చేస్తున్న జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి

కేసుల పరిష్కారానికి కృషి



న్యాయవాదులతో జిల్లా జడ్జి భీమారావు

పీలేరు రూరల్ : ఈ నెల 9న జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా ప్రధాన జడ్జి ఇ.భీమారావు అన్నారు. శనివారం సీనియర్ సివిల్ కోర్టును ఆయన తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ విజయవంతం కోసం న్యాయవాదులు తమవంతు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులునాయక్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి, న్యాయవాదులు పాల్గొన్నారు.

పాముకాటుతో ఇద్దరికి అస్వస్థత

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో పాము కాటుతో ఇద్దరు వ్యక్తులు అస్వస్థతకు గురై స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మదనపల్లె మండలం శానిటోరియంకు చెందిన జి.రాజు(30) శనివారం పొలం పనులు చేసుకుంటుండగా, పాముకాటుకు గురయ్యాడు. తీవ్ర అస్వస్థతకు లోనవగా, కుటుంబ సభ్యులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు. అదే విధంగా పీటీఎం మండలం రాపూరివారిపల్లెకు చెందిన ఆంజనేయులురెడ్డి భార్య మాధురి(43) పొలం వద్ద గడ్డికోస్తుండగా విషపురుగు కాటేసింది. దీంతో ఆమె తీవ్ర అస్వస్థతకు గురికాగా, కుటుంబ సభ్యులు బి.కొత్తకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్సలు అందించి మెరుగైన వైద్యం కోసం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

భక్తులతో పులకించిన గండి క్షేత్రం

కిక్కిరిసిన క్యూలైన్లు





ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయస్వామి, స్వామి దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

చక్రాయపేట : పవిత్ర పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయస్వామి ఆలయం శనివారం భక్తులతో పులకించిపోయింది. క్షేత్రంలో శ్రావణ మాసం మూడవ శనివారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి సైతం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్వామిని దర్శించుకొని పరవశించిపోయారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. స్వామి దర్శనం కోసం సుమారు 3 గంటల పాటు సమయం పట్టింది. రద్దీని దృష్టిలో ఉంచుకొని పోలీసులు అద్దాలమర్రి క్రాస్, ఇడుపులపాయ క్రాస్‌ల వద్దనే వాహనాలు నిలిపి వేశారు. దీంతో భక్తులు కాలినడకన గండికి చేరుకొని దర్శించుకున్నారు. కొందరు వేంపల్లె చక్రాయపేట, నాగలగుట్టపల్లె, వేముల తదితర ప్రాంతాల నుంచి కాలినడకన వచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల కోసం దాతలు పెద్ద ఎత్తున అన్నదానాలు చేశారు. క్యూలైన్ల వెంట నీళ్ల ప్యాకెట్లు ఉంచి తాగునీటికి ఇబ్బంది లేకుండా చేశారు. ట్రిపుల్ ఐటీ, వేంపల్లె డిగ్రీ కళాశాల, పాలిటెక్నికల్ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు.. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా తమ సేవలను అందించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మన్ రాఘవేంద్రప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు రవికుమార్‌రెడ్డి, పాలకమండలి సభ్యులతోపాటు పులివెందుల డీఎస్పీ వినోద్ కుమార్, ఆర్కేవ్యాలీ సీఐ గోవిందరెడ్డి, చక్రాయపేట, ఆర్కేవ్యాలీ ఎస్సైలు వినోద్ కుమార్, రంగారావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. చక్రాయపేట సురభి ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యాధికారులు స్వర్ణలత, శివప్రసాద్‌ల ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కోలాటం, భరతనాట్యం, కూచిపూడి నాట్యంతోపాటు పౌరాణిక నాటకాలు భక్తులను అలరింపజేశాయి. ఆలయ ప్రధాన, ఉప ప్రధాన, ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజ గోపాలాచార్యులు, రఘుస్వామి, వేదపారాయణం రామమోహనశర్మలు.. స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

అంజన్న సన్నిధిలో ప్రముఖులు

గండి వీరాంజనేయస్వామిని పలువురు ప్రముఖులు వచ్చి దర్శించుకున్నారు. కమలాపురం శాసనసభ్యుడు రవీంద్రనాథరెడ్డి, ముఖ్యమంత్రి వ్యక్తిగత సహాయకుడు రవిశేఖర్, ఏఆర్ అదనపు ఎస్పీ కృష్ణారావు, పులివెందుల ఆర్డీవో వెంకటేశ్వర్లు తదితరులు దర్శించుకున్న వారిలో ఉన్నారు.

కుక్కల దాడిలో దుప్పి మృతి

ఒంటిమిట్ట : ఒంటిమిట్టలో శనివారం కుక్కల దాడికి గురై ఒక దుప్పి మృతి చెందింది. అటవీ శాఖ రేంజర్ ప్రణీతబాయ్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వర్షాలు కురవక అటవీ ప్రాంతాల్లో నీటి కొరత ఉన్నందున శుక్రవారం దాహం తీర్చుకునేందుకు ఒంటిమిట్టలో గల చెరువులోకి 6 ఏళ్ల వయసు గల దుప్పి వచ్చింది. దాన్ని గమనించిన సుమారు 6 కుక్కలు తరుముతూ కరవడంతో తీవ్రంగా గాయపడింది. దుప్పి పరుగెత్తుకుంటూ ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయం వద్ద ఉన్న టీటీడీ అన్న ప్రసాద కేంద్రం దగ్గరకు వచ్చింది. భక్తులు గమనించి కుక్కలను చెదర గొట్టారు. అనంతరం స్థానిక అటవీ శాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి దుప్పిని తమ వాహనంలో చికిత్స నిమిత్తం స్థానిక పశు వైద్యశాలకు తీసుకువెళ్తుండగా మార్గంమధ్యలో మృతి చెందింది. అనంతరం వెటర్నరీ డాక్టర్ స్వాతి.. దుప్పికి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో బ్రహ్మయ్య, ఎఫ్‌బీవోలు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



కృత్రిమ మేధస్సుతో సవాళ్లకు పరిష్కారం



ఫెలోషిప్ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్జీయూకేటీ చాన్సలర్, ఉన్నత విద్యామండలి చైర్మన్

వేంపల్లి : కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్)తో సమాజంలో మానవాళి ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలను పరిష్కరించవచ్చని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ చాన్సలర్ చెంచురెడ్డి పేర్కొన్నారు. శనివారం ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీ కాన్ఫరెన్స్ హాల్‌లో కోణం ఫౌండేషన్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ విద్యార్థులకు కోణం ఫెలోషిప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి సందీప్ కోణం స్థాపించి నిర్వహిస్తున్న కోణం ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమైన ఫెలోషిప్ అందజేయడం అభినందనీయమన్నారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ శాస్త్రసాంకేతిక రంగాల్లో మన దేశం ఎన్నో విజయాలను సాధిస్తోందని తెలిపారు. అలాంటి విజయాల వెనుక ఉన్న విజేతల జాబితాలో ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీ పూర్వవిద్యార్థి సందీప్ కోణం కూడా చోటు దక్కించుకోవడం మనందరికీ గర్వకారణమన్నారు. కోణం ఫౌండేషన్ చైర్మన్ సందీప్ కోణం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల ప్రతిభకు మెరుగులుదిద్ది ఉన్నత శిఖరాల వైపు వారు పయనించేలా చేయాలన్న సంకల్పంతో తొలిసారిగా తమ సంస్థ ఫెలోషిప్‌ను తాను చదువుకున్న ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీలో ప్రారంభించినట్లు వెల్లడించారు. కోణం ఫౌండేషన్ ద్వారా ఆర్థిక పరమైన నిధులను సమకూర్చడంతోపాటు విద్యార్థుల కెరీర్‌కు దోహద పడేలా అంతర్జాతీయ స్థాయి నిపుణులచే సలహాలు, సూచనలు ఇప్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యాపకులు, కోణం ఫౌండేషన్ సమన్వయకర్త మహమ్మద్ రఫీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రాంభూపాల్‌రెడ్డి, అధ్యాపకులు సమరసింహారెడ్డి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌కు ఘన నివాళి

ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 14వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆర్జీయూకేటీ చాన్సలర్ కె.చెంచురెడ్డి, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ సంధ్యారాణి క్యాంపస్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఓ రాంభూపాల్‌రెడ్డి, అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

అట్లూరు : విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై తహసీల్దారు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్‌ఐ కె.సి.రాజు తెలిపారు. పోతులవీరయ్య అనే వ్యక్తి తరచూ తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి న్యూసెన్స్ చేస్తూ విధులకు ఆటంకం కలిగిస్తున్నాడని తహసీల్దారు శ్రీవాణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శనివారం తెలిపారు.

బాధిత మహిళకు బాసటగా ‘దిశ’

- వేధింపులకు గురి చేసిన వ్యక్తిపై దిశ ఎస్‌ఓఎస్‌కు ఫోన్
- తక్షణమే స్పందించిన పోలీసులు

మదనపల్లె : ఆపదలో ఉన్న మహిళలు, అమ్మాయిలను కాపాడేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన దిశ ఎస్‌ఓఎస్ యాప్ సత్ఫలితాలనిస్తోంది. అసభ్యకర చేష్టలు, లైంగిక వేధింపులపై బాధిత మహిళలు దిశ యాప్‌నకు ఫోన్ చేసిన వెంటనే తక్షణమే పోలీసులు స్పందించి ఘటనా స్థలానికి చేరుకోవడంతోపాటు రక్షణ కల్పిస్తున్నారు. తాజాగా.. మదనపల్లె పట్టణంలోని రెడ్డీస్‌కాలనీలో నివాసం ఉంటున్న ఓ మహిళను కొద్ది రోజులుగా ఎక్కడకు వెళ్లినా ఓ అజ్ఞాతవ్యక్తి వెంబడిస్తున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి ఎన్‌టీఆర్ సర్కిల్ వద్ద ఇంటికి నడుచుకుంటూ వెళుతున్న మహిళను బైక్‌పై వచ్చిన వ్యక్తి అడ్డగించి అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాధిత మహిళ అతడిని నెట్టివేసి అక్కడ నుంచి తప్పించుకుని నేరుగా ఇంటికి చేరుకుంది. కుటుంబ సభ్యులకు విషయాన్ని తెలిపి, తన ఫోన్ నుంచి దిశ ఎస్‌ఓఎస్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేసింది. మదనపల్లె వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న బాధిత మహిళ ఇంటికి దిశ పోలీసులు నిమిషాల వ్యవధిలో చేరుకున్నారు. మహిళ చెప్పిన వివరాలను నమోదు చేసుకున్నారు. ఆమె ఇంటికి దగ్గరలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. అజ్ఞాతవ్యక్తి బైక్‌పై వచ్చి మహిళను ఇబ్బందులకు గురి చేసినట్లు గుర్తించారు. బైక్ నంబర్ సరిగా కనిపించకపోవడంతో అజ్ఞాతవ్యక్తి ఎవరనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. బాధిత మహిళకు అందుబాటులో ఉండే విధంగా ఒక మహిళా కానిస్టేబుల్‌ను రక్షణగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా మాట్లాడుతూ.. మహిళను వేధింపులకు గురి చేసిన వ్యక్తిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, త్వరలోనే పట్టుకుని కేసు నమోదు చేస్తామన్నారు. అత్యవసర సమయాల్లో ఆపదలోని మహిళలకు రక్షణ కవచంగా దిశ యాప్ సేవలందిస్తోందని, మహిళలందరూ తమ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

రూ.12.69 లక్షల నకిలీ సిగరెట్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సిగరెట్లతో విజిలెన్స్ అధికారులు

మదనపల్లె : పట్టణంలో నకిలీ, అనధికారిక విదేశీ బ్రాండ్ సిగరెట్లు అమ్ముతున్నారని వచ్చిన సమాచారం మేరకు.. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ అధికారి షేక్ మాసూంబాషా ఆదేశాలతో విజిలెన్స్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. అప్పారావుతోట మధుసూధన థియేటర్ సమీపంలోని నటరాజ్‌గోడౌన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో నటరాజ్ వివిధ రకాలైన నకిలీ సిగరెట్లను గోడౌన్‌లో ఉంచుకుని పట్టణంలో విక్రయిస్తున్నట్లు గుర్తించి, అతడి వద్ద నుంచి రూ.12,69,600 విలువ చేసే 4,800 సిగరెట్లు ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. విదేశీ సిగరెట్లు విక్రయించేందుకు నటరాజ్‌కు ఎలాంటి అనుమతులు లేకపోగా, ప్యాకెట్లపై ఎం.ఆర్.పీ, ఆరోగ్యహెచ్చరికలు ముద్రించకపోవడంతో అతడిపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా కడప రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్‌మాసూంబాషా మాట్లాడుతూ... నకిలీ బ్రాండ్, విదేశీ, అనుమతిలేని సిగరెట్లు అమ్మడం, కొనడం చట్టరీత్యా నేరమని, అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దాడుల్లో విజిలెన్స్ అధికారి టి.రెడ్డెప్ప, అగ్రికల్చరల్ ఆఫీసర్ బాలగంగాధరరెడ్డి, ఏఈ విజయ్‌కిశోర్, డిప్యూటీ తహసీల్దార్ రెడ్డెప్ప, వీఆర్వోలు జయలక్ష్మి, హరిత, విజిలెన్స్ జనార్దన్‌రావు, నాగేశ్వరరావు, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో ఆర్టీసీ డ్రైవర్ మృతి



వి.ఆర్.గోపాల్ మృతదేహం

పీలేరు రూరల్ : గుండెపోటుతో విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్ మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలిలాఉన్నాయి. పీలేరులోని ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన వి.ఆర్.గోపాల్ స్థానిక ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా సుదీర్ఘ కాలంగా పని చేస్తున్నాడు. శనివారం యథావిధిగా విధులకు హాజరై పీలేరు – సుండుపల్లె బస్సు సర్వీసుకు వెళ్లాడు. సుండుపల్లె నుంచి పీలేరుకు వస్తుండగా గర్నిమిట్ట బస్‌స్టాప్ వద్ద తనకు ఛాతినొప్పి రావడంతో.. బస్సును ఆపి ప్రయాణికుల సాయంతో గర్నిమిట్టలో ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో 108 వాహనంలో పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. డ్రైవర్ వి.ఆర్.గోపాల్ పీలేరు డిపోలో ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్నాడు. విషయం తెలుసుకున్న ఆర్టీసీ డీఎం కుమార్, పలు యూనియన్ నాయకులు, ఆర్టీసీ ఉద్యోగులు.. మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

చెరువులో కాలు జారి పడి..



చెరువులో నుంచి మృతదేహాన్ని బయటకు తెస్తున్న స్థానికులు

కురబలకోట : చెరువులో కాలు జారి పడి యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం కురబలకోట మండలంలోని మొలకవారిపల్లెలో జరిగింది. ముదివేడు ఎస్‌ఐ ముబీన్ తాజ్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మొలకవారిపల్లె రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన ఎస్.ఆరీఫుల్లా (అనీఫుల్లా) (32) ఆటో డ్రైవర్‌గా ఉన్నారు. వీరి కాలనీ పక్కనే నల్ల బయ్యమ్మ చెరువు ఉంది. శుక్రవారం రాత్రి కాళ్లు, చేతులు కడుగుకోవడానికి చెరువులోకి వెళ్లాడు. అక్కడ చీకట్లో సరిగా కనిపించక కాలు జారి పడిపోయాడు. విషయం తెలుసుకున్న స్థానికులు రాత్రి వేళ అతని కోసం గాలించారు. సాధ్యం కాకపోవడంతో శనివారం మదనపల్లె అగ్నిమాపక బృందం రెస్క్యూ టీమ్ లైఫ్ బాయ్, లైఫ్ జాకెట్లు, రోప్‌వేలు, పాతాళ భైరవి సాయంచే గాలింపు చర్యలు చేపట్టారు. గంట పాటు శ్రమించారు. ఎట్టకేలకు మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి కుటుంబీకులకు అప్పగించారు. మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారిది నిరుపేద కుటుంబం. అదే రోజు స్వగ్రామంలో అంత్యక్రియలు గావించారు.

బిల్డింగ్ పడికట్లు కూలి..



మృతి చెందిన నారాయణ

రాజంపేట : చుండువారిపల్లె గ్రామ పరిధిలోని జగనన్న కాలనీలో బిల్డింగ్ పడికట్లు పడి వడ్డె నారాయణ(58) అనే భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. శనివారం మధ్యాహ్నం వరకు పని చేసి పడికట్ల కింద నిద్రపోతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మృతుడు అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో..

గాలివీడు : మండల పరిధిలోని గోపనపల్లె గ్రామం సిద్దవాండ్లపల్లెకు చెందిన టి.రమణమ్మ (45) విద్యుత్ తీగలు తగిలి మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. శనివారం తమ ఊరిలోని మురళీమోహన్ నాయుడుకు చెందిన పొలంలో వరి నాట్లు వేయడానికి సుబ్బరామయ్య భార్య రమణమ్మ వెళ్లింది. అక్కడ వరి నాట్లు వేస్తుండగా పక్కన కట్టెలమీద ఉన్న కరెంట్ తీగలను గమనించకపోవడంతో.. తన చేతిని తలపైకి తీసుకొనే సమయంలో విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. తోటి కూలీలు కేకలు వేయడంతో వారి కుటుంబ సభ్యులు, బంధువులు చేరుకొని రమణమ్మను కాపాడే ప్రయత్నం చేశారు. వెంటనే రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని గ్రామ సర్పంచ్ చెన్నకేశవరెడ్డి సందర్శించి, బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు.

గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం

రాజంపేట : కడప–రేణిగుంట జాతీయ రహదారిలోని ఇసుకపల్లె క్రాస్ రోడ్డు (రాజంపేట)లో శనివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం చెందాడు. గుర్తుపట్టలేని విధంగా మృతదేహం చిన్నాభిన్నమైంది. ట్రాఫిక్ స్తంభించిపోయింది. మన్నూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను నియంత్రించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ఏరియా హాస్పిటల్‌కు తరలించారు.

రైతాంగం సంక్షేమానికి ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : రైతాంగం సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. శనివారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ప్రతి ఒక్క రైతు తరఫున పంటల బీమా ప్రీమియం మొత్తం చెల్లించదని పేర్కొన్నారు. చంద్రబాబు, ఆయన గజదొంగల ముఠా, దుష్ట చతుష్టయంలోని ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5, దత్తపుత్రుడు దుష్ప్రచారం చేస్తూ మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. పంటల బీమా పరిహారం మొదలు, మద్దతు ధర వరకు వ్యవసాయ రంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తేవడం ద్వారా రైతులకు చోదోడు వాదోడుగా నిలిచామన్నారు. దేవుడి దయ వల్ల ఈ నాలుగేళ్లలో ఒక్క కరువు మండలం లేకున్నా, అప్పుడప్పుడూ అధిక వర్షాలు ఇతర కారణాల వల్ల జరిగిన పంట నష్టాన్ని పరిగణలోకి తీసుకుని.. 54,48,000 మంది రైతులకు వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం ద్వారా 7,802 కోట్ల పరిహారం చెల్లించడం జరిగిందన్నారు. చంద్రబాబు హయాంలో ఆహార ధాన్యాల దిగుబడి 152 లక్షల టన్నులు ఉండేదని, నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాలుగేళ్లలో సగటున 13 లక్షల టన్నులు పెరిగి 165 లక్షలకు చేరిందన్నారు. 2019 నుంచి నియోజకవర్గంలో ప్రకృతి వైపరీత్యాలతో 11 వేల హెక్టార్లలో పంటలు దెబ్బతింటే తక్షణం ప్రభుత్వం స్పందించి పరిహారం కింద 35 కోట్ల రూపాయలు అందించడం జరిగిందన్నారు. రైతులు పండించిన పంటలకు రైతు భరోసా ద్వారా గిట్టుబాటు ధర కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, పట్టణ అధ్యక్షుడు సీహెచ్ రమేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు తదితరులు పాల్గొన్నారు.

సౌమ్యనాథస్వామి సేవలో టీటీడీ చైర్మన్



సౌమ్యనాథస్వామి సన్నిధిలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి

నందలూరు (రాజంపేట) : నందలూరులోని సౌమ్యనాథ ఆలయాన్ని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి శనివారం దర్శించుకున్నారు. గర్భాలయంలోని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు చైర్మన్‌ను శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సౌమ్యనాథ ఆలయం టీటీడీలో విలీనం అయినందున టీటీడీ తరఫున అభివృద్ధి చేస్తామని తెలిపారు. అంతకుముందు ఆయన తన స్వగ్రామం నందలూరు మండలంలోని ఈదరపల్లి గ్రామానికి విచ్చేశారు. గ్రామంలోని పలువురితో మాట్లాడి, చిన్ననాటి సంఘటనలు గుర్తు చేసుకున్నారు. అనంతరం గ్రామంలోని తన కుటుంబ సభ్యుల సమాధుల వద్ద నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

గొంతుకోసుకుని యువకుడి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : ఇంట్లోని కుటుంబ సభ్యులతో గొడవపడి మనస్తాపంతో ఓ యువకుడు గొంతుకోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శనివారం పట్టణంలో జరిగింది. పోతులప్పవీధికి చెందిన రమేష్ కుమారుడు ఎం.పూజిత్(24) ఇంట్లో తల్లి, చెల్లితో గొడవపడ్డాడు. దీంతో మనస్తాపం చెంది ఇంట్లోనే గొంతు, చేతిపై కోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం ఆస్పత్రిలో అడ్మిట్ కాకుండా యువకుడు ఇంటికి వెళ్లిపోయాడు.